


20

మంచికంటి

# లలిత కళలూ జిందాబాద్

ఆ హాలు ఎప్పటినుండో నిద్రలో జోగుతున్నట్టుగా ఉంది. ఎటు చూసినా శ్మశాన నిశ్శబ్దం. హాలు నిండుగా ఎటుచూసినా సంగీత వాయిద్య పరికరాలే. ఎప్పటి నుండో సంగీతాన్ని వినిపించలేక అలోరామచంద్రా అని అల్లాడుతున్నట్టుగా ఉన్నాయి. ఇప్పుడన్నీ బూజుపట్టి దారాలు దారులుగా వేలాడుతున్నాయి. సాలె పురుగులు గూళ్లు పెట్టుకుని తమ సంతానాన్ని పెంపొందించుకుంటున్నాయి. చీమలు బారులు తీరి అటూ ఇటూ వడివడిగా సాగిపోతున్నాయి. ఎలుకలు కన్నాల్లో నుండి తోడిన మట్టి మూలల్లో రాసులు రాసులుగా కుప్పలు పడి ఉంది. రకరకాల కీటకాల సంతతి అటూ ఇటూ హడావిడిగా తిరుగుతూ ఉన్నాయి.

హఠాత్తుగా ఒక మూలనున్న తబలా ఉలిక్కి పడింది. నిద్రలో నుండి మెలకువలోకి వొచ్చినట్టుగా కళ్లు నులుముకుంది. తన చుట్టూ ఉన్న వాయిద్యాల నన్నింటినీ తేరిపార జూసింది. అన్నీ గురకపెట్టి నిద్రపోతున్నాయి. పక్కవాటిని తట్టింది. అవి ఆవులిస్తూ, లేసాయి. అలా మాటామాటా,

రాగం రాగం, శృతీ తాళం, శబ్దం శబ్దం విని ఒక్కో వాయిద్యమూ నిద్ర నుండి బయట పడసాగాయి.

ఎంత కాలం నుండి ఇలా మగ్గిపోయామో గదా మాతాత ముత్తాతల కాలంలోనైతే ఎంతెంత మంది ఎన్నెన్ని రకాలుగా వాయించేవాళ్లు. ఇప్పుడు ఒక్క జాకీర్ హుస్సేనొక్కడే గతైపోయాడు 'తబలా లబలబలాడుతూ చెప్పింది.

అవును వేం ఎన్నెన్ని ఉద్యమాల్లో పాల్గొన్నాము. ఎన్నెన్ని పాటల దళాలు, ఎన్నెన్ని బృందాలు, ఏకాలేజీలో చూసినా మా శబ్దం వినబడ కుండా ఉండేదా! ఆ బంగారపు రోజులు మళ్ళీ మళ్ళీ రావమ్మా కంజర ఖణఖణలాడుతూ వాపోయింది.

చినమౌలానా ఊదుతుంటే నేనే పరవసించి పోయేదాన్ని. ఇప్పుడెవురు నేర్చుకుంటున్నారు నన్ను చావుకాక సన్నాయిమేళం అని పేరుకూడా పడి పోయింది!" సన్నాయి కర్ర అటూ ఇటూ ఊగుతూ "పిప్పీపి... పిప్పీపి... పీపీ..." అంటూ మూలిగింది.

ఇప్పటి మనుషులకు మరీ బుద్ధిలేకుండా పోయిందమ్మా. అస్సలు ఏవాయిద్యాలనీ వాయించడం నేర్చుకోకుండా గుడ్లప్పగించి అదేందమ్మా అదేందో కరెంటు బొమ్మలు పెట్టెలోకే తొంగి తొంగి చూస్తున్నారు. టట్టటైయ్... టటైయ్' అంటూ మూల నుండి వీణ సన్నాగా మూలిగింది.

చా.. చాచా ఎలా ఉండేవాళ్ళప్పుడు యువకులు. ఇప్పుడంతా చచ్చుదద్దమ్మల్లాగా తయారై పోతుండారు. ఒక్కడూ గిటార్ వాయించేవాడే కనబడడే. మరీ ఇక్కడ వొంగి వొంగి కూర్చోవడం ఎంత తల వంపులుగా ఉందనీ 'గిటార్లన్నీ ఒక్కసారిగా భోరుమన్నాయి.

'డీవీ సుబ్బారావూ, స్థానం నరసింహారావూ, షణ్ముఖ ఆంజనేయరాజు, కెవీ కొండల్రావూ, గూడూరి సావిత్రీ ఎంతెంత మంది... ఆ పద్యాలు గొంతు విప్పి రాగాలు పాడుతుంటే ఎంత వైభవంగా మోగేదాన్ని గతించిపోయినదా వైభవము అకటకటా' అంటూ హార్మోనియం మెట్లు మెలమెల్లగా కదిలాయి.

'కాళ్ళకు కట్టుకున్న నాట్యకారులు కూచిపూడి, భరత నాట్యం వేస్తుంటే మా వొళ్లు ఝుల్లుమనేది. ఇప్పుడా హయ్యో రామా' మొరపెట్టుకున్నాయి. గజ్జలు ఘల్లుఘల్లు మంటూ గజ్జెలు. తుప్పొదిలి పోయాయి అంటూ పరమానంద భరితుడైపోయాడాయన. రెండు చేతులెత్తి పరవశంగా నమస్కరించాడు.

కాసేపటికి ఈ లోకంలోకి వొచ్చాడు. అవునూ ఇవన్నీ ఎక్కడకు పోతున్నట్టు. పైకి లేసి జారిపోతున్న పంచెని సరిచేసుకున్నాడు. గోచీలాగి బిగదీసి కట్టు కున్నాడు. లోపలికి తొంగి చూశాడు. ఎలుకలూ, పందికొక్కుల నివాసాలూ , సాలెగూళ్ళు విన్యాసాలూ కనిపించాయి.

'అమ్మో కొంప కొల్లేరై పోయిందిరా బాబూ' అంటూ బైటకు ఎగిరి దూకేడు. దబ్బున నేలమీద పడ్డాడు. పైకిలేచి కాలూ చెయ్యీ కూడదీసుకుని వాయిద్యాలమీద వెంటపడ్డాడు.

వాయిద్యాలన్నీ వరుసలు వరుసలుగా ముందుకు కదులుతూ, నినాదాలు చేసుకుంటూ, తమను తామే వాయించుకుంటూ పరుగులెత్త సాగాయి.

వాటివెంటపడి కేకలు వెయ్యసాగాడాయన. అయినా అవేమీ పట్టించుకోలేదు. పరుగెత్తుకుంటూ వాటిముందుకు వొచ్చి, రెండు చేతులూ పైకెత్తి దణ్ణంపెడుతూ మీరు ఈ విధంగా బజారున పడితే నాషాపేంగాను నాబతుకేంగానూ ' అంటూ లబోదిబో మన్నాడు.

'ఓయబ్బో మాషాపు తెగ అమ్మి పడేస్తున్నావు మమ్మల్ని' డ్రమ్ పుల్లతో ఒక్కటెయ్యబోయింది డ్రమ్.

అమ్మమ్మ అంత మాటనబాకండయ్యా. ఏడాదికో ఆర్నెల్లకో ఒకటీ అరా బైటకు పంపిస్తానే ఉండాను కదా' బతిమలాడుతున్నట్టుగా చెప్పాడు.

'ఎంతకాలం మమ్మల్నిలా జైల్లో ఖైదీల్లాగా బంధించి ఉంచుతావు. మగ్గిమగ్గి చెదలు పట్టి బూజుపట్టి ఎలుకలుగొట్టి శిధిలమైపోయి అక్కడే చావడం మావల్లగాదు అనిడోలుగుద్ది మరీ చెప్పారు.

తలమీద చెంగేసుకుని, చెవుల్లో చేతివూళ్ళు దూర్చుకుని, నిరాశతో, నిరామయంగా, అయోమ యంగా అక్కడే కూలబడిపోయాడాయన.

ఆరుబయట చల్లనిగాలిలోకి వొచ్చేసరికి, వాయిద్యాలకు వొళ్ళుపులకించి పోయింది. ఎక్కడ లేని ఆనందంతో గొంతుచించుకుని అరుస్తున్నాయి. అంతకంతకూ నినాదాల జోరు పెరగసాగింది. ఆ ఊరేగింపుని జనం తండోపతండాలుగా చూడసాగేరు. అన్ని వాహనాలూ ఎక్కడివి అక్కడే నిల్చిపోయాయి. ఎవరినోట విన్నా ఈచోద్యమే చెప్పుకోసాగారు.

ఆ జనాలను చూడడంతో వాటికి ఇంకా హుషారు పెరిగిపోసాగింది. సంతోషంగా ముందుకు సాగిపోతున్నాయి. అయితే ఆసంతోషం ఎంతోసేపు నిలువలేదు.

కాసేపు చోద్యం చూసిన జనం టీవి షాపుల ముందు కలకలం విని అటు పరుగెత్తి పరిగెత్తి ఎగిరెగిరి క్రికెట్ మ్యాచ్ చూడసాగేరు. వాళ్ళని చూసి బాధపడ్డాయి. చీదరించుకున్నాయి. సంతోషం ఉన్న వైపు రాకుండా, ఉద్రిక్తతలు, అనవసర వినోదాలు అనారోగ్యకరమని తెలుసుకోలేక వాటి కోసం ప్రాకులాడుతున్నారు దద్దమ్మలు అని తిట్టుకున్నాయి.

ఇంకలాభం లేదమ్మా మనం బజార్లు తిరిగే కొద్దీ ఇంతే సంగతులుగా కనిపిస్తుంది. మన మొహం చూసేవాళ్ల సంఖ్య తగ్గిపోతుంది.

నాలుగురోడ్ల కూడలిలోకి పదండి. అక్కడ అందరమూ కూడి కచ్చేరీ చేద్దాం. 'అనుకుంటూ అన్ని బక్కుమ్మడిగా కూడలికి చేరాయి.

అక్కడ బస్సులు, లారీలు, కార్లు, ఆటోలతో విపరీతమైన రద్దీగా ఉంది. వాయిద్యాలు ఇక మనం ఇలాగే ఈ గోడౌన్లలో కదలకుండా బూజు పట్టిపోతూ ఉంటే ఈ మూర్ఖపు మనుషులకి అస్సలుబుద్దీ జ్ఞానం రాదు. రకరకాలుగా మనస్సును రంజింపజేసి మనోవ్యాధుల్ని సైతం నయం జేసే మన సంగీత వాయిద్యాల కుటుంబాన్ని... మనం సృష్టించే వీనుల విందైన సంగీతాన్ని పట్టించుకోక ఎన్ని రకాలుగా బాధలు పడుతున్నారో అమాయకులు పిల్లనగ్రోవి గొంతులో గాలిపోసుకుంటూ చెప్పింది.

మనందరం ఏదో ఒకటి జేసి ఈ బుద్దిలేని మనుషుల కళ్ళు తెరిపించాలి. శాక్సాఫోన్ గొంతెత్తి అరిచింది.

'ఏంచేద్దాం' గిటార్, మాండలిన్, వయొలిన్, ఏక్తార కళ్లు నులుముకుంటూ అడిగాయి.

'కుంబకర్ణ నిద్రపోతున్నాడు డ్రమ్ పెద్దన్న నిద్రలేపుదాం పదండి' ఏదో ఒక సలహా ఇస్తాడు అని అన్నీ కూడబలుక్కుని డ్రమ్ని డమా డమా బాది నిద్రలేపాయి. ఆ ఏందబ్బాయ్' అంటూ ఆవలిస్తూ నిద్రలేసింది డ్రమ్.

'ఏక కంఠంతో అన్నీ కలిసి విషయం చెప్పాయి.


కళ బండబారి పోయిందబ్బాయ్. మనుషులు వొఠ్ఠి మరమనుషుల్లాగా తయారయ్యారు. ఇంక మనకి కాలం చెల్లిపోయినట్టే. అయితే మనం ఒక పని చెయ్యొచ్చు. మనం ఇక్కడ ఈ గోడౌన్లలో మగ్గిపోతున్న సంగతే చాలామందికి తెలియదు. కాబట్టి ఇక్కడనుంచి బయటకు పోతే మంచిది తన నిలువెత్తు శరీరాన్ని డ్రమ్ పుల్లలతో దమడమా కొట్టుకుంటూ చెప్పింది.

"అయితే ఇప్పుడేం చెయ్యాలంటావ్ పెద్దన్నా" అన్ని వాయిద్యాలూ గలగలమంటూ అడిగాయి.

"ఏముంది చెయ్యడానికి అందరమూ ఈ బూజులు తొలగించుకుని బయటపడాలి. నలుగురికీ మన గురించి పరిచయం చేసుకుందాం. మర్చి పోయిన వాళ్ళకు గుర్తుచేద్దాం. తెలియని పిల్లలకు తెలియజెప్పుదాం. హార్మోనియం హుషారుగా మోగింది.

'అయితే లేవండి. అందరూ లేవండి. ఆ మొద్దునిద్ర పోయేవాళ్ళను కూడా లేపి కుదెయ్యండి. అందరూ సిద్ధంకండి 'అంటూ డ్రమ్ పెద్దన్న పెద్దగా అరిచి చెప్పింది.

అప్పటికప్పుడు ఆగోడౌన్‌లో కలకలం బయలుదేరింది. అన్నీ నిద్రలేచి వొంటికి పట్టిన బూజులు దులుపుకున్నాయి. సాలెగూళ్ళను తెంపు కున్నాయి. గొంతులు సవరించుకున్నాయి. సిద్ధంగా నిలబడ్డాయి.



త్యాగయ్యకీ జై అన్నమయ్యకీ జై, బాల సరస్వతికీ జై, వెంపటి చినసత్యానికీ జై, జాకిర్ హుస్సేన్‌కీ జై, పి. సుశీలకు జై, జిక్కీ, ఎల్లారేశ్వరీకి జై, ఎం.ఎస్. బాలసుబ్రహ్మణ్యంకీ జై, మంగళంపల్లికీ జై, ఎం.ఎస్. సుబ్బలక్ష్మికీ జై, ఎస్.పీ.కీ జై, హిందుస్థానీకీ జై, కర్ణాటక సంగీతానికీ జై... అంటూ జై కొట్టడాలు నినాదాలు మిన్నుముట్టాయి.

కౌంటర్ టేబుల్ మీద తలవాల్చి తరతరా లుగా అలాగే నిద్రపోతున్నట్టున్న యజమాని చెవుల్లో గింగురుమనే శాబ్దాలేవో వినిపించాయి. ఆ శబ్దాలకు కళ్ళు తెరిచి, వొళ్ళు విరుచుకుని పైకి లేచి, చుట్టూ పరిసరాలను పరికించి చూశాడు.

ఏమీ కనిపించలేదు. కొద్దిసేపటి తరువాత శబ్దాలు ఎక్కడి నుండి వొస్తుందీ అర్థమైంది. ఇంతలోనే బుడుంగుమని తబలా బైటకు ఒక్కగెంతు గెంతింది. హార్మోనియం,డ్రమ్స్ పిల్లంగోవులు సన్నాయి కర్రలు, కంజిరాలు ఒక దానివెంట ఒకటి మోగుతూ దొర్లుతూ పొర్లుతూ ఎగురుతూ గేటు దాటుతున్నాయి.

ఇది కలా... నిజమా.. అని రెప్పవాల్చకుండా అలాగే చూస్తుండి పోయాడా యజమాని. చిరునవ్వు వొలకబోస్తూ, అతనివైపే చూస్తూ నినాదాలు చేస్తున్న వాటివైపు చూస్తుంటే కడుపునిండిపోయిందాయనకు ఆహాహా ఈ పేర్లన్నీ చెవులారా విని ఎన్నో రోజులై పోయింది. చెవులుదానికొకటి మెల్లమెల్లగా సందు గొందుల్లోగుండా దూరి మెయిన్ రోడ్డు మీద కొచ్చి తిష్టవేశాయి.

అప్పటిదాకా వసూళ్ళలో బిజీగా ఉన్న వసూల్‌రాజు కానిస్టేబుల్ క్రమక్రమంగా ట్రాఫిక్ ఆగిపోవడం గమనించాడు. ఏం జరిగిందిరా బాబూ అనుకుని రెండు పేంటు జేబుల్లో దోసుకున్న డబ్బు జాగ్రత్తగా పట్టుకుని పరుగెత్తుకుంటూ వొచ్చి చూసే సరికి చౌరస్తాలో వాయిద్యాల గుంపు కనబడింది.

'ఏయ్ ఎవరు రమ్మన్నారు మిమ్మల్ని. లేవండి లేవండి ట్రాఫిక్కంతా ఆగిపోయింది. అదిలారీ తీసుకుని తబలాకీ, హార్మోనియంకూ నాలుగు అంటించాడు.

'ఇవాళ ఇక్కడనుండి లేచేదేలేదు. ఇక్కడ సంగీత కచ్చేరీ చేస్తున్నాం. నువ్వు కూడా కూర్చొని విను. అనడంతో కానిస్టేబుల్‌కు చిర్రెత్తు కొచ్చింది.

లారీ తీసుకొని మళ్ళీ ఒక్కటి వెయ్య బోయాడు. అన్ని వాయిద్యాలూ కట్టకట్టుకుని కానిస్టేబుల్ పైకి దూకాయి.

ఆ భయంకర శబ్దానికి చెవులు రెండూ మూసేసుకుని, అమ్మో నా అంతు చూసేటట్టు ఉన్నయ్యే అనుకుని వెనక్కు తగ్గాడు.

ఆగిపోతున్న ట్రాఫిక్‌ని దారిమళ్ళించి క్లియర్ చెయ్యడానికి వెళ్లాడు.

వాయిద్యాలన్నీ తమను తాము శృతి చేసుకోసాగాయి. చుట్టూ ముసలా ముతకా, పిల్లాజెల్లా చుట్టూ చేరారు. రోడ్లపై చెత్త మేస్తున్న పశువులు తలలెత్తి శబ్దాలు వినిపించిన వైపు తిరిగి చూసి మళ్ళీ తమపనిలో తాము నిమగ్నమైపోయాయి.

సంగీత ప్రపంచాన్ని బయటి ప్రపంచానికి పరిచయం చేద్దామనుకున్న వాయిద్యాలన్నింటికీ చుట్టూ మూగిన తక్కువమంది జనాలను చూసి నీరసం వచ్చేసింది. అయినా సరే వీళ్లకైనా చూయిద్దామనుకుని కొంతసేపు సంగీతం వినిపించ ప్రయత్నించాయి.

కాసేపు ఆ తమాషా చూసిన వాళ్ళు కూడా నెమ్మదిగా జారుకోసాగారు.

ప్చ్ లాభంలేదు అనుకుంటూ అన్నీ దిగాలు పడిముఖాలు వేలాడేశాయి. కొన్ని వాయిద్యాలు ఇప్పుడేం చెయ్యాలి అని తలలు పట్టుకున్నాయి.

కాసేపు అందరి తలలూ పగలగొట్టుకున్నాక ఐడియా అంటూ తబలా పైకీ కిందకూ ఎగురుతూ చిందులు వెయ్యసాగింది.

ఏందో అది తొందరగా చెప్పమ్మా తల్లీ అంటూ విసుక్కుంది వీణ

ఏంలేదు నగరాలలో మనల్ని ఎవరూ పట్టించుకోరని అర్థమై పోతుంది. పల్లెటూళ్లకన్నా పోదాం. అక్కడైతే పగలంతా పనులు చేసు కున్న జనాలు రాత్రిపూట వినోదం కోసం కాచుక్కూచు నుంటారు? తబలా లబలబలాడుతూ చెప్పింది.

'ఏంపెద్దన్నా' కోరస్‌గా అడిగాయి పెద్దడ్రమ్మును.

తల పైకీ కిందకూ ఆడిస్తూ చూద్దాం పదండి ప్రయత్నిస్తే తప్పేంలేదుకదా! అంది.

సరేనంటే సరేనని అనుకున్నాయి. వాయిద్యాలన్నీ ఒకదానివెంట ఒకటి బారులు తీరి వీపులు వాయించుకుంటూ, గొంతులు సవరించుకుని పల్లెటూరి దారిపట్టాయి.

పట్టణంలోనున్నటి రోడ్లమీద దొర్లుతూ పొర్లుతూ వచ్చిన తబలాలు ఈ గులకరాళ్ళు రోడ్లమీద ఎగిరెగిరి పడసాగాయి.

అబ్బో ఇయ్యి రోడ్లేనా ! వొళ్ళంతా గుల్లగుల్ల యిపోతుంది కదమ్మా' అంటూ వాయిద్యాలన్నీ రోదించసాగాయి.

ఇక్కడి మనుషులు నడిచే డొంకరోడ్లు ఉండేయని ఒకప్పుడు మాతాత చెబుతా ఉండేవాడు.

ఆ రోడ్లమీదైతే ఎంచక్కా కాళ్ళకు చెప్పులు కూడా లేకుండా నడవొచ్చంట. అట్టాంటిది ఇంతకాలం తరువాత ఎన్నో కొత్త కొత్త రకాల రోడ్లు కనుక్కున్నారు. కానీ దారులుమాత్రం ఎట్టా ఉండయ్యో చూడండి అంటూ వెటికలు విరిచిందొక హార్మోనియం పెట్టె.

పాడుకాలం పాడుబుద్ధులమ్మా ఏంచేస్తాం ఇట్టాంటి రోజులు చూస్తాం అనుకోలేదు' డ్రమ్ గుడ్లురుముతూ ధమ ధమా మోగింది.

అష్టకష్టాలూ పడి వొళ్లంతా రక్తం కారుతూ వోటి మోతలు మోగుతూ, తీగలు తెగిపోయి కుయ్యో మొర్రోమంటూ పల్లెటూరుకి చేరాయి.

ఎదురుగా చెంబు చేత పట్టుకొని వొస్తున్న తాతని రచ్చబండ ఎక్కడ అని అడిగాయి.

'ఇప్పుడు రచ్చబండలుఎక్కడ ఉండయ్యయ్యా. అన్నీటినీ పడదోసి సెంటర్లో రకరకాల బిల్డింగులు కట్టేరుకదా అన్నాడాయన.

అదైనా ఎక్కడో చెప్పవయ్యా' గలగలమంటూ విసుక్కున్నాయి గజ్జెలు

అదా అదైతే పోలక్కడ అని చెప్పి చెంబు తీసుకుని, గోచిపైకిలాగి పట్టుకుని పడమరవైపుకు పరుగెడుతున్నట్టుగా పోయాడు.

సెంటర్లోకి వచ్చి చతికిల పడిన తరువాత ఇక్కడ కచ్చేరీ జరుగుతుందని చాటింపు వేసి రమ్మని కంజిరలకు పురమాయించాయి.

సరే పదండమ్మా పదండనుకుని, బజారు బజారూ వాయించుకుంటూ తిరిగాయి. కానీ వాటికి ఎదురు వొచ్చిన వాళ్ళంతా వింతగా చూశారే గానీ ఎవ్వరూ ఆగిన పాపాన పోలేదు. ఏదో వెనక తరుముకొస్తున్నట్టుగా ఒకటే పరుగు. పిల్లలెవ్వరూ బజార్లలో కనబడ్డం లేదు. అన్ని బజార్లు తిరిగి నీరసంగా సెంటర్లోకి వచ్చాయి.

కమ్యూనిటీ హాలు వరండాలో కచ్చేరీకి అన్ని ఏర్పాట్లూ చేసుకుంటున్న వాయిద్యాలు కంజిరాల వాలకం చూసి ఏంజరిగిందంటూ చుట్టుముట్టాయి.

ఏం చెయ్యమంటారమ్మా ఎవరన్నా బజార్లో మనుషులు కనబడుతున్నారేమో చూడండి. సరే ఏమైపోయారబ్బా అని ఇళ్ళల్లోకి తొంగి చూసేమమ్మా పిల్లలేమో పలుకలూ పుస్తకాలూ ముందేసుకుని టీవీ పెట్టెలముందు చతికిల పడ్డారు. ఆడంగులేమో ఆగ్యాస్ పొయ్యిలూ, గిన్నెలూ అన్నీ ఆ పెట్టెల ముందుకే తెచ్చుకుని వంటలు వండు కుంటున్నారు.

ముసలీ ముతకా అన్నా కనబడలేదా' అనుమానంగా అడిగాయి.

అమ్మావాళ్ళకి కళ్ళు మసకలైనా, కళ్ళల్లో శుక్లాలు పెరిగినా కూడా పోయి బల్లుల్లాగా టీవిలకి అంటుకొని చూస్తుందారు. కంజెరలు వాపోసాగాయి.

ఇంక మనం ఎవురికి వినిపించాలి' అవతల వైపు హార్మోనియం శృతి చేసుకోవడం ఆపి నీరసంగా కుయ్‌కుయ్ మనసాగింది. 'అమ్మో చేసిన వరకు చాలు నోర్మూసుకో ' అని వయోలిన్ విసుక్కుంది.

సరే ఇక్కడ కూడా మన అవసరం లేదని అర్థమైపోయింది. ఇంక ఏం చెయ్యాలో చెప్పండి. ఆ జైలు నుండి విముక్తయితే కలిగింది. మనవల్ల ఎవురికీ ఏమీ ఉపయోగం లేకపోతే ఏంజెయ్యాల. పదండి ఏనుయ్యో గొయ్యో చూసుకుందాము ' గిటారు కళ్ళ నీళ్ళు పెట్టుకుంది?

నాకు ఇంకొక్క ఆశ మినుకు మినుకుమంటా ఉంది' సన్నాయి చిన్నగా పిప్పీపి. పిప్పీపి అంటూ గొణిగింది.

'ఏందో చెప్పి తగలడవమ్మా' వీణ టంగ్ టంగ్ టయ్ అంటూ మీటుకుంది.

'ఆ ఏమీలేదూ.. ఈ ఊళ్లన్నిటికీ కరెంట్లూ, డిష్ వైర్లూ వొచ్చేసినియ్యిగదా ఇయ్యేమీ తెలియని మనుషులు అడవుల్లో ఉండారు. వాళ్ళకి రైళ్ళు బస్సులూ, రోడ్లూ పాడూ ఏమీ తెలియవంట, వాళ్ళని ఎవురైనా బురిడీ కొట్టిస్తారంట. వాళ్ళు దగ్గరికి పోతే ఎట్టా ఉంటదో సందేహం వెలిబుచ్చింది సన్నాయి.

ఎక్కడికి పోయినా ఒకటిగానే కనపడతందిలే ఎందుకబ్బా అనిపిస్తుంది. ఏమంటారు గిటార్ నీరసంగా తన అభిప్రాయం చెప్పింది.

అందరూ మళ్ళీ డ్రమ్ పెద్దన్నవైపు చూశాయి.

డ్రమ్ పుల్లలతో గీరుకుంటూ సరే సన్నాయి మాటలూ కాస్త సబబుగానే ఉండయ్యి. మళ్లీ నేను చెప్పానని మాత్రం నా మీదకు రావొద్దు. ఏమంటారు? అన్నిటివైపూ చూసింది.

అందరూ చివరి ప్రయత్నం చేద్దాం లేదా ఇంక ఇంతే సంగతులు అనుకుని బయలుదేరాయి.

చెట్టునీ పుట్టనీ దాటుకుంటూ, పురుగూ పుట్రా చూసుకుంటూ, కొండల మధ్యన కోనల మధ్యన ఉన్న పూరి గుడెసెలు వెతుక్కుంటూ ఆశ చావక పోలో మంటూ సాగివొచ్చాయి.

అమ్మా ఇక్కడ వీళ్ళకు ఉండడానికి గుడిసెలే అయినా కరెంటు గిరెంటు బాగానే ఉందమ్మా. అయ్యేందమ్మా ఇళ్ళపైన స్తంభాలూ, వాటి పైన బొచ్చులూ ఉండయ్యి' అనుమానంగా వీణమీటుతుంది.

ప్చ్... ప్చ్,,, ఇక్కడ కూడా మనుషుల అలికిడి ఏమీ ఉండట్టులేదమ్మో ' గిటారు మోగింది.

హా... ఏముంది వీళ్ళకూపెట్టెలుండాయి. చూడండి లోపల. ఇల్లల్లోనే కల్లూ సారాయి తాగి పాటలు పెట్టుకొని డాన్సులు వేస్తున్నారు చూడండి.

అందరికీ కోపం వచ్చేసింది. అన్నీ కలిసి వాళ్ళ ఇళ్ళు వాకిళ్ళు దగ్గరకి పోయి పెద్దగా సంగీతం మోగించాయి.

వాళ్ళకేమీ వినిపించలేదు. వాళ్ళేమీ పట్టించుకో లేదు. మనం కనబడ్డట్టు వినబడ్డట్టు కూడా లేదు వాళ్ళకి. 'ఇంక పోదాం పదండి. ఇంక మన బతుకు లెందుకు, ఎవురికీ పనికిరానప్పుడు అందరం కట్టగట్టుకొని గోదాట్లో దూకుదాం పదండని'' అన్నాయి కొన్ని వాయిద్యాలు.

అదే సరైన దారిలే అని మిగిలినవి కూడా వంత పాడాయి.

అన్ని వాయిద్యాలూ గోదారి వైపుకు మళ్లాయి. చెట్లూ పుట్టలూ ఏమీ కనిపించదములేదు. ఒకదానివెంట ఒకటి.. ఒకదానివెంట ఒకటి పడుతూ లేస్తూ ... దొర్లుతూ పొర్లుతూ పరుగులు తీయసాగాయి.

ఎంతో విరక్తితో అన్నీ గోదావరి గట్టుమీదకు చేరుకున్నాయి. ఆఖరుసారిగా ఒకదాని ముఖం ఒకటి చూసుకున్నాయి. జై భజరంగ భళీ అంటూ ఒక్కొక్కటి నీళ్ళలో దూక సాగాయి. వాయిద్యాలన్నీ ఒక్కసారిగా తనలో చేరడంతో వొళ్ళంతా పులకించి పోయింది. తన చేతుల్ని సాచి అన్నింటినీ తన అక్కున చేర్చుకుంది. ఏ ఒక్క వాయిద్యమూ నీటిలో మునిగి పోలేదు. అన్నీ గోదావరిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాయి.

అందరి కళ్ళనీళ్ళూ తుడిచిన గోదావరి అసలు వాటి ఏడుపుకూ, ఆత్మ హత్యలకు కారణాలు అడిగింది.

ఒకదాని తర్వాత ఒకటి పోటీలు పడి జరిగిన విషయమంతా చెప్పాయి. ఈ మనుషులకు ఏం కావాలో ఏమి అవసరం లేదో తెలుసుకోలేక ఎన్నో బాధల్ని కొని తెచ్చుకుంటున్నారు. వాళ్లకోసం మేము చేసిన ప్రయత్నాలన్నీ వ్యర్థమై పోయాయమ్మా. ఇంక వాళ్ళు పడే బాధలు చూళ్ళేక, మాతో ఎవరికి ఏం పనిలే అని ఈ నిర్ణయానికి వొచ్చేశాము తమ గోడు వెళ్ళబోసుకున్నాయి.

చూడండమ్మా మీ సంగీతాన్ని ఎవరువిన్నా వినక పోయినా నేను వింటాను. ఆపైన ఆకాశంలో వెలిగిపోతున్న చంద్రుడు వింటాడు. ఆ వెన్నెల వింటుంది. మీరు ఎప్పటికీ బతికి ఉండాలమ్మా. ఇవాళంటే ఏదో మూర్ఖంతో ఏదో వాటివెంటబడి పరుగులు తీస్తున్నారు గానీ వాళ్లే తెలుసుకుని పరుగులు తీస్తూ మీ దగ్గరకు వొస్తారమ్మా. అయితే మనల్ని ఎన్ని రకాలుగా ఇబ్బందులు పెట్టినా వాళ్ళు మనపై ఆధారపడే అమాయకులమ్మా. కానియ్యండి శృతి చేసి మీటండి. విని తరిస్తాము అంటూ గోదావరి చంద్రునివైపు చూసింది.

చంద్రుడు కూడా నవ్వాడు. వెన్నెల వాయిద్యాల మీద పొడిపొడిగా రాలింది.

వాయిద్యాలన్నీ సిద్ధమయ్యాయి. గొంతులు ఆనందంతో శృతి చేసుకున్నాయి. సంగీతం జలపాతమే అయ్యింది. ఆ మాధుర్యానికి గోదారమ్మ పులకించి పోయింది. వెన్నెల సంగీతంలో తడిసి ముద్దయ్యింది. చంద్రుడి కళ్ళవెంబడి ఆనంద భాష్పాలు రాలాయి.

తమ జన్మ సార్ధకమైపోయిందని వాయిద్యాలన్ని సంబర పడిపోయాయి. తమ అవసరం తెలియజెప్పినందుకు గోదారమ్మకు కృతజ్ఞతలు చెప్పాయి. మళ్ళీ వెనక్కు తిరిగి తమ పూర్వ స్థానానికి చేరుకోవడానికి దారిబట్టాయి.